# గలగలా గోదారి

-భైరవయ్య


ఆ వూరికదే పెద్ద వీధండి. ధాన్యం బస్తాలు నిండుగా వున్న రెండెడ్లబళ్లు నాలుగొక్కసారిగా కదలడానికి వీలుగా వున్న వీధండది. ఆ వీధి, కాలవ దగ్గర ప్రారంభమయి, రాములవారి కోవెల మీదుగా దాటె వంపు తిరిగి కొబ్బరి తోటల దగ్గర కెళుతుందండి. మిగతా వీధులూ వున్నా యనుకోండి. మన కథలో వాటికి ప్రాధాన్యత లేదండి. పెద్దవీధి ప్రత్యేకతేమిటంటే వుందండి. ఆ వూరికది పెద్దవీధవడ మొకటే కాదండి. రాములవారి గుడి వుండటమూ కాదండి. ఆ వీధిలో రామరాజుగారుంటా రండి. అది విశేషమేనండి. రామరాజుగారంటే, పెద్ద రాజుగారి తర్వాత అంతోటివారండి, ఆస్తిలోనండి. అదొకటే కాదండి. ఆయనకి రావణాసురిడి లంకంత కొంప వుండటమూ కాదండి. రావణాసురిడి పది తలకాయలకే సరిపడేటంత మీసాలుండటమూ కాదండి. సూరీడు లేవకముందే రాజుగారు లేచి పోతారండి. లేస్తూనే అరుగు మీద కొచ్చేస్తారండి. అరుగంటే ఒక్కొక్కటీ అరవై చదరపుటడుగులుంటు ందండి. అందులో ఒకదాని మీదకొచ్చేశ్తారన్నమాటండి. వూరికే రారండి. చేతిలో గుండు మరచెంబుంటు ందండి. అది వెండిదండి. దాన్నిండా నీళ్లండి. ఆ నీళ్లలోనాన్తూ, ఆయనగారి మీసాల్లా బారుగా వున్న వేప పుల్లుంటుందండి. ఆయనలా వచ్చి, ఎడంపక్క అరుగుమీద బాసీపట్టు వేసుక్కూర్చుంటా రండి. కూర్చునండి, ఆ వేపపుల్ల నోట్లో ఓసారి పెట్టుకుని, గాఠిగా కొరికి, ఖాండ్రించి వుమ్మేస్తారండి. అప్పుడు ప్రారంభమవుతుందనుకున్నాం కదండి. అక్కడ మంచి రాజుగారింటిదాకా అన్నీ పెద్ద కుటుంబాల ఇళ్లేనండి. ఆపైనంతా చిన్నా, చితుకు కుటుంబాల వారివండి. పొద్దుట్నే లేచిన జనం, కాలవ గట్టుకో మంచినీటి చెరువుకో, ఆ వీధినే వెళ్ళాలండి. ఆడంగులైనా అంతేనండి. పక్క వీధులున్నాయనుకోండి. వీధులంటే, వీధులు కావనుకోండి. వాటమ్మట నడవటానికి అనుభవం కావాలండి. పరుశురామాలయ సర్కస్‌లో తాడుమీద నడిచే పిల్లయితే నడవగలదేమోనండి. అదలా వుంచండి. బళ్ళు ఆ వీధమ్మట తప్ప మరో దానిమీద వూరంతటికీ తెలిసిపోతుందండి. "రాజుగోరు షళ్ల తోముకోడనికి అరుగు మీదకి చేరారహో" అని. ఆ దంతధావన యజ్ఞం అలా ప్రారంభమవుతుందండి. ఓ నాలుగు ఘడియలపాటు సాగుతుందండి. అంటేసూరీడు బద్ధకం గట్రా వదిలించేసుకుని, లోకాలన్నీ తిరిగొచ్చెయ్యాలని హుషారు పడిపోయిన తర్వాత కొంతసేపటి కన్నమాటండి. ఆ నాలుగు ఘడియలు ఆ వీధి దిన చర్యలో అతిముఖ్యమైన భాగవన్నమాటండి.

మరేవండి, చెప్పొస్తున్నదదే కదండి.

అది పెద్ద వీధనుకున్నాంకదండి. కాలవ దగ్గర

## యెప్పుడూ మావే నేటండి

వెళ్లలేవండి. గొడ్లుకూడా ఆ వీధమ్మటే వేళ్తాయండి. మరో వీధమ్మట వెళ్తే గేదెలకొమ్ములు, అటుయిటూ గోడలకి తగిలేస్తాయండి. కొమ్ములో, గోడలో ఏదో ఒకటి విరిగిపోవచ్చండి. ఈ కార్యక్రమాలన్నీ, రాజుగారు దంతధావన యజ్ఞంలో వున్నప్పుడు జరగాల్సినవే నండి. అలా ఎవరి పనులు వాళ్లకి జరిగిపోతుంటే కథే వుందండి.



పెద్దిళ్లలో ఆడంగులు వీధిలోకి రారండి. మగమా రాజులకి రాజుగారింటి మీదుగా వెళ్లాల్సిన అవసరమూ, రాదండి. వచ్చినా బెంగ లేదండి. కష్టవంతా చిన్న కుటుంభాల వాళ్లకేనండి. ఆ వీధమ్మట నడవటం వాళ్లకి తప్పనిసరండి. చాకలి, మంగలి, వడ్రంగి అలా అందరూనండి. అందరికీ పొద్దుటే గదండి పన్లూ, గట్రానూ. నీళ్లవి తెచ్చుకోడానికి కాలవకెళ్ళాలన్నా, చెరువుకెళ్లాలన్నా ఆ వీధమ్మటెళ్తే ఆడంగులకి హైరా నుండదండి. కాలో, చెయ్యో దెబ్బతినేస్తుందనే భయమూ వుండదండి. కానండి, ఆడంగుల వీధమ్మట పొద్దుట పూట నడవటం మానేశారండి. రాజుగారు కూచు మంటారుగదండి. వారు కూచున్నప్పుడు, వారికెదురుగుండా, ఆడకూతురు వీధమ్మట నడవటం తప్పు గదండి. రాచచూపు పడకూడదనే నమ్మకమూ వుందనుకోండి. అందుకనండి, ఆడంగులు పెద్ద వీధి నొదిలేసి పక్క వీధుల్లోంచే, కాలూ చెయ్యి చూసు కుంటూ తిరుగుతారండి. మగాళ్లకి, ఆ వీధమ్మట నడవటం తప్పదండి.

'నడిస్తే ఏమిటవుతుంది' అంటారా. అవుతుంది కనకే అదంరికీ ఆ అదురండి.

ఆ వీధిలో ఇళ్ళన్నీరాజుగారిల్లున్నవైపునేవున్నాయండి. రాజుగారింటెదురుగా, పశువుల పాకలు, గాదెలు వున్నాయండి. జనం ఆ పక్కనుంచే నడుస్తారండి. రాజుగారింటె వైపునించి నడవరండి. అయినా వారిమీద రాచదృష్టి తప్పదండి.

రాచదృష్టి అంటే మరేమీ కాదండి.

ఏ రాజుగారిదో, ఏ పంతులుగారిదో, ఏ పెదకాపుదో పిలుపందుకున్న సింహాచలం, పొడి చేత పట్టుకుని కదండి. అది రాజుగారికిక్కట్టదండి. "థూ లం...కొడక, ఎడ్లని సరిగా నడిపించలేవురా, ఎడ్డి లం...కొడకా" అంటూ ఆవేశపడిపోతారండి.

అలాగండి, ఒకళ్లననిగాదండి. పెద్దింట్లోళ్ళని తప్ప, మిగతా వాళ్ళనందర్నీ అంతేనండి "లం...కొడకా" అంటూ నోరుపారేశుకుంటారండి. అందరికీ బాధగానే వుందండి. ఆ మాటనడానికెవడికీ సాహసం లేదండి. రాజుగారు కదండి. పైగా పెద్దోరు కదండి. అదీగాక, "లం...కొడకా అంటే మీకొంపేం మునిగిందిరా ల... కొడకా" అనంటారేమోనని అనుమానమూ వుందండి.

ఆడంగులయితే గోడల పక్కనుంచి మెటికలిరుస్తానే వుంటారండి. మగాళ్ళు ఆయన వెనక తిట్టు కుంటారండి. కుర్రకారుకి పౌరుషాలొచ్చి, పెద్దోళ్ల దగ్గరంటే, "పో నీంద్రా పిచ్చిముండాకొడుకు ఆడలా బయల్దేరతాడాండి. అప్పటికి రాజుగారి యజ్ఞం ప్రథమ ఘట్టంలో వుంటుందండి. ఆయన వీణ్ణి చూస్తానే, నోట్లోవున్న వేపపుల్ల పారాన్నంతా తుపుక్కున వూసండి, 'ఏరా ఎదవ లం...కొడకా, బుద్ధుందట్రా, లేస్తూనే నీమొహం చూపిస్తావంట్రా లం......కొడకా' అంటా రండి. వాడు 'ఆ య్' అనేసి వెలిపోతాడండి. వీరాచారీ అలాగే వెళ్తాడండి. 'ఓరి గాడిద లం......కొడకా అడ్డ మైనోళ్ల తిరిగే రోడ్డయి పోయిందిరా" అంటాడండి, రాజుగారు. వాడు పళ్ల బయట పెడ్డి గోడలోకి ఒదిగి పోతూ తప్పుకుంటాడండి.

గేదె లావీధిమ్మటే వెళ్తాయన్నాంకదండి. గేదెలు కదండి పేడేస్తాయండి. ఎక్కడెయ్యకూడదో వాటికి తెలియదు కదండి. అందుకని, రాజుగారింటి దగ్గర కూడా వేస్తూ వుంటాయండి. అది చూసి, రాజుగారు తాండవం ఆడేస్తారండి. నోట్లో వేప పుల్లని త్రిశూలంలా పట్టుకుని, "గేదెల్ని తోలడం తెలీని లం...కొడకల్లారా మీతలకాయలు పేడతో చేస్కాడా బెమ్మదేవుడు" అంటూ శివాలు తొక్కేస్తారండి.

రెండెడ్ల బళ్లు అటే ఎళ్ళాలికదండి. ఎడ్లుకదండి పరుగెడతా వుంటాయండి. మరి, దుమ్ములేస్తుంది

"ఆయన నోట్లోనోరెట్టకండ్రా మంచిది కాదు. పుర్రెకు పుట్టిన బుద్దది" అని పెద్దింటోళ్ళు నచ్చచెబుతూ వుండేవారండి. రోజులలాగెళ్లి పోతున్నాయండి.

పెద్దవీధి కొబ్బరితోట కెళుతుందనుకున్నాంగదండి. అటేపు తాటి చెట్లు దట్టంగా వున్నాయండి. తరాలుగా రామన్న కుటుంబమే కల్లు గీస్తూ వస్తోందండి. సూరీడు మొలవకుండా ముంతల్లో కల్లు తీసి, కావిడి నింపుకుని, ఆ వీధమ్మటే వెళ్ళటం కూడా తరాలుగా వస్తున్న అలవాటండి. రైలు గట్టమ్మట వెళ్లాలంటే కోసెదు దూరం ఎక్కువ నడవాలండి. తోవంతా ముళ్లడొంకలూ, తుప్పలూనండి. అందుకని రామన్న ఆ వీధమ్మటే వెళ్తాడండి. వాడి తండ్రులు తాతలుకూడా అలాగే వెళ్తారండి... రాజుగారి తండ్రులు, తాతల హయామ్ములో కూడా అంతేనండి. చికాకులేవీ వుండేవిగాదండి. రామరాజుగారి హయామ్ములోనే చికాగ్గా వుందండి. రాజుగారి తండ్రి బతికున్నంత కాలం, రామరాజుగారి గొంతు వినిపించేది కాదండి. ఆయన పోయాక, ఈయన గొంతు పెరిగి పోయిందండి.

ఆయ్ అలా రామన్న కావిడేసుకుని వచ్చినప్పుడల్లా, రాజుగారి దండకం వినిపించేదండి. అక్కడికీ, వాడు అటేపు గోడవారనే కుండలు తొణక్కుండా వెళ్ళేవాడండి. అయినా రాజుగారి చూపు, నాలుక వాడిమీద పడకుండా వుండేవి గాదండి.

"లం...కొడకా బుద్ధి లేదంట్రా. ఎదవ కంపు కొట్టుకుంటూ ఈ రోడ్డుమీద సావకపోతే, మానెయ్యకూడదంట్రా ఆ యెదవపని లం...కొడకాని లం...కొడకా" అని ఆయన లంకించుకోవడం. వాడు సమాధానం వెప్పకుండా వెళ్లిపోతూ వుండటం మామూలయి పోయిందండి.

ఆ రోజుకూడా కావిడేసుకుని రామన్నొస్తున్నాడండి. అంత దూరంలో వాణ్ణి చూసి, "రోజూ చెబుతున్నా బుద్ధి లేదు లం...కొడక్కి. ఆ తాడి సెట్లు కొట్టేంచేస్తేనే కాని, ఈ లం...కొడుకు ఈ రోడ్డుమీద కంపుకొట్టుకుంటూ వెళ్లడం మానడు" అంటూ అదిరిపోవటం మొదలెట్టారండి. రోజూగోడవేపున వెళ్ళే రామన్న, ఆ రోజు రాజుగారింటి వేపునుంచే వచ్చాడండి.

"పొగరెక్కువై పోయిందేమిట్రా లం...కొడకా ఇటేపొస్తున్నావు" అన్నారండి.

వాడు మాటాడలేదండి. కావిడి ఆయన ముందు దింపాడండి. నెత్తినున్న తలపాగా తీసి చేతిలో పెట్టుకున్నాడండి.

రాజుగారు పిచ్చెక్కినట్టుగా ఎగిరి పడుతున్నాడండి. ఆయన రంకెలు విని, పల్చగా జనమూ పోగయ్యారండి.

"దండాలండి" అన్నాడండి రామన్న.

రాజుగారికి సీమ పచ్చి మిరపకాయ కారం రాసినట్టయిందండి.

"లం...కొడకా" అని ఏదో అనబోతున్నారండి.

"ఆయ్ ఎప్పుడూ మావే లం...కొడుకులవేటండి. తవరుగోరు యెప్పుడూ అవరాండి" అన్నాడండి రామన్న.

అనేసి కావడి బుజాన వేసుకుని వెళ్లిపోయాడండి.

రాజుగారికి, చుట్టుపక్కల జనానికి నోటమాట లేదండి.

ఆయ్! తరవాత, ఆ అరుగు మీద రాజుగారెప్పుడూ, ఎవరూ చూడలేదండి.

